
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 25 । మార్చి । 2024



ఓటు వివరాలూ తెలుసుకోవచ్చు

ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. 8లో



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.06



న్యూస్‌రీల్

వైభవంగా లక్ష్మీదేవి కల్యాణోత్సవం



లక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

రొళ్ల: మండల కేంద్రం రొళ్లలో లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి లక్ష్మీదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు ఆలయ ఆవరణలో కలశ స్థాపన చేసి యోగీశ్వర ఆరాధన నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం లక్ష్మీదేవి సమేత నరసింహస్వామిని ఉత్సవ విగ్రహాలను ఉయ్యాలలో కూర్చోబెట్టారు. తర్వాత వేదపండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. ముందుగా ఆచారం ప్రకారం గ్రామ సమీపాన పుట్ట వద్దకు వెళ్లి విశేష పూజలు చేశారు. పుట్టలోకి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణోత్సవం వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సోమవారం బ్రహ్మ రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భూ వివాదంతోనే గోపాలకృష్ణపై దాడి



విలేకర్లతో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

మడకశిర: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఏఎస్ గోపాలకృష్ణపై జరిగిన దాడిని వైఎస్సార్‌సీపీపై రుద్దేందుకు టీడీపీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. భూ వివాదం నేపథ్యంలోనే తనపై దాడి జరిగిందని, ఇందులో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధమూ లేదని గోపాలకృష్ణ స్పష్టం చేశారు. దీంతో టీడీపీ నేతలు చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలింది. వివరాల్లోకెళితే... గోపాలకృష్ణకు మడకశిరలోని మధుగిరి రోడ్డులో వేరుశనగ మిల్లు ఉంది. ఈ మిల్లు స్థల విషయంలో గోపాలకృష్ణ, పట్టణానికి చెందిన అన్సర్ మధ్య వివాదం ఉంది. ఈ క్రమంలో ఈ నెల 18న గోపాలక్రిష్ణపై అన్సర్ దాడి చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడిని పరామర్శించడానికి ఆదివారం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు రాకేష్ మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితర టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా రాకేష్ మీడియాతో మాట్లాడుతూ గోపాలకృష్ణపై జరిగిన దాడి ఘటనలో వైఎస్సార్‌సీపీకి సంబంధముందని ఆరోపించారు. వాస్తవ విషయాలు వక్రీకరణ జరగడంతో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంటనే ఖండించారు. అనంతరం బాధితుడు గోపాలకృష్ణ సైతం మీడియా ముందుకొచ్చి రాకేష్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూ వివాదంతోనే తనపై దాడి జరిగిందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఎటువంటి సంబంధమూ లేదని చెప్పారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: అందరి సహకారంతో జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రశాంతి గ్రాంలోని తన కార్యాలయంలో క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం ఆదివారం నిర్వహించారు. వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది, ఆశ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులతో కలసి కార్యాలయం నుంచి వై.జంక్షన్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. 2025 నాటికి టీబీని సమూలంగా నిర్మూలించే దిశగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఎస్ వి కెన్ ఎండ్ టీబీ'అ నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ కృష్ణయ్య, డీఎల్‌ఏటీ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య, ఎంపీడీఓ నాగేశ్వర రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు



పుట్టపర్తి మండలం గోనేనాయక్ తండాలో నివాసముంటున్న రామాంజినమ్మబాయికి సొంత ఇల్లు ఉంది. భర్త, ఇద్దరు పిల్లలు కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. వీరి ఇంటికి గతంలో రూ.300 నుంచి రూ.400 కరెంటు బిల్లు వచ్చేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం పకడ్బందీగా అమలు చేశారు. దీంతో బిల్లు డబ్బులు మిగిలిపోయాయని రామాంజినమ్మ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే కరెంటు బిల్లు భారం తప్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెబుతున్నారు.



పుట్టపర్తి మున్సిపాలిటీ ఒకటో వార్డు సాయినగర్‌లో నివసిస్తున్న ఓబులేసు వికలాంగుడు. ఈయన ఇంటిలో రెండు లైట్లు, ఫ్యాన్ ఉన్నాయి. గతంలో నెలకు రూ.200 వరకు కరెంటు బిల్లు వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పక్కాగా అమలవుతోంది. దీంతో ప్రతి నెలా బిల్లు డబ్బు ఆదా అవుతోందని ఓబులేసు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. పేదల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అంటున్నారు.



- ఉచిత విద్యుత్‌తో ఉపశమనం
- నాలుగేళ్లలో రూ.45 కోట్ల లబ్ధి
- ఒక్కో లబ్ధిదారుకు రూ.1200 వరకు ఆదా
- జగన్ ప్రభుత్వంలో 200 యూనిట్ల వరకు ఉచితం

పుట్టపర్తి టౌన్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. నవరత్నాల పథకాలతో సంక్షేమ కాంతులు నింపడమే కాకుండా ఉచిత విద్యుత్ అమలు చేస్తోంది. ఒక్కో కుటుంబం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ వినియోగించుకోవచ్చు. ఒక్కో కుటుంబం వినియోగించే కరెంటును బట్టి కనిష్టం రూ.100 నుంచి గరిష్టం రూ.1100 వరకు బిల్లు చెల్లించనవసరం లేకుండా పోయింది. టీడీపీ హయాంలో వంద యూనిట్ల వరకు మాత్రమే ఉచిత విద్యుత్ అమలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ ఉచిత విద్యుత్ యూనిట్లను 200 వరకు పెంచారు. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలోని దాదాపు 48 వేల ఎస్సీ కుటుంబాలకు రూ.31.78 కోట్లు, 17వేల ఎస్టీ కుటుంబాలకు రూ.13.95 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

పథకం పక్కాగా అమలు

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్ పథకం పక్కాగా అమలు చేస్తున్నాం. మీటర్లు లేని వారికి కూడా నూతనంగా మీటర్లు ఏర్పాటు చేశాం. ఆయా వర్గాలకు ఎంతో మేలు కలుగుతోంది. వారు వినియోగించే బిల్లు ప్రభుత్వం చెల్లించడం గొప్ప విషయం.

– సురేంద్రబాబు, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ

బిల్లు కట్టనవసరం లేదు



గత టీడీపీ హయాంలో కరెంటు బిల్లు నెలకు రూ.300 నుంచి రూ.400 వరకు వచ్చేది. జగన్ అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేశారు. దీంతో మేము ఆ యూనిట్ల పరిధిలోనే కరెంటు వాడుతున్నందున బిల్లు కట్టే అవసరం లేకుండా పోయింది. మాలాంటి పేదల కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– గంగాద్రి, కర్ణాటకనాగేపల్లి, పుట్టపర్తి మండలం

హర్షించదగ్గ విషయం



ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు గతంలో 100 యూనిట్ల వరకు ఉన్న రాయితీ కరెంటును 200 యూనిట్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచడం హర్షించదగ్గ విషయం. పేదల సంక్షేమం కోసం ఇంతలా పరితపించే ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదు. మేము ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడుతున్న జగన్‌కు అండగా ఉంటాం.

– నరసింహులు, సాయినగర్, పుట్టపర్తి

కొత్తచెరువులో చికెన్ వ్యాపారి కిడ్నాప్

- గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు

కొత్తచెరువు: కొత్తచెరువు మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున చికెన్ వ్యాపారి ఉప్పు చలపతి కిడ్నాప్ ఉదంతం కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు... ఉప్పు చలపతి మండల కేంద్రంలోని బుక్కపట్నం రోడ్డులో మార్కెట్ వద్ద చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ లాగే ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటలకు చికెన్ షాపు తెరవడానికి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అప్పటికే స్థానిక షిర్డీసాయిబాబా ఆలయం దగ్గర రెండు కార్లలో కాపు కాచిన దుండగులు వేగంగా వచ్చి చలపతి ద్విచక్ర వాహనాన్ని అడ్డగించారు. అతన్ని బలవంతంగా కారులో ఎక్కించుకుని బుక్కపట్నం వైపు వెళ్లారు. చలపతి కేకలు వేయడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రాజా రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాపర్లు ముదిగుబ్బ వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ముదిగుబ్బ పోలీసులను అప్రమత్తం చేయడంతో వారు కూడా రంగంలోకి దిగారు. ముదిగుబ్బ సమీపంలో కిడ్నాపర్లను గుర్తించి వెంబడించారు. చలపతిని రక్షించి.. ఏడుగురు కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. మరొకరు తప్పించుకున్నారు. ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండలో ఉంటున్న చలపతి బావమరిది ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఈ కిడ్నాప్ చేయించినట్లు తెలుస్తోంది. కేసు సమగ్ర దర్యాప్తు తర్వాత కిడ్నాప్‌నకు కారణాలు వెల్లడిస్తామని సీఐ రాజారమేష్ తెలిపారు.

గరుడ వాహనంపై నారసింహుడు



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పోటెత్తిన భక్త జనం



శ్రీవారికి హారతి ఇస్తున్న అర్చకులు

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణల మధ్య ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహుడికి వాహనంగా పంపుతారని.. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, ఇహ పరమైన ఈతి బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు అంతటి ప్రాధాన్యత ఉంది.

హోరెత్తిన గోవింద నామ స్మరణ

భక్త ప్రహ్లాద వరదుడు ఆలయంలో నుంచి ప్రధాన రాజగోపురం వద్దకు రాక మునుపే ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారు తూర్పు రాజగోపురం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి గోవిందా..గోవింద' అంటూ హోరెత్తింది. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. విద్యుద్దీపాలంకరణ, కదిరి మల్లెలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉభయదారులుగా కుటాగుళ్లకు చెందిన బేరి వర్తకులు నారాయణప్ప శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు శేషవాహనం

బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు శేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్గించనున్నారు. ప్రతి ఉత్సవంలోనూ నారసింహుడు మాత్రమే తిరు వీధుల్లో విహరించేవారు. అయితే శేషవాహనంపై శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరు వీధుల్లో భక్తులకు దర్శనమివ్వడం ఈ ఉత్సవ ప్రత్యేకత.

పరిటాల సునీతకు 'సెగ'



మద్దెలచెరువులో వైఎస్సార్‌సీపీ జెండాలు ఊపుతున్న ప్రజలు

కనగానపల్లి: రాప్తాడు టీడీపీ అభ్యర్థి పరిటాల సునీతకు ప్రజల నుంచి నిరసన ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె కనగానపల్లి మండలం మద్దెలచెరువు, వేపకుంట, కొండపల్లి గ్రామాల్లో పర్యటించారు. మద్దెలచెరువులో గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ జెండాలు ఊపుతూ 'గో బ్యాక్' అంటూ నిరసన తెలిపారు. టీడీపీ హయాంలో మా గ్రామానికి మీరు చేసిందేమీ లేదని, ఇక్కడ మీ మద్దతదారులు ఎవ్వరూ లేరంటూ నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సద్దుమణిగించారు.


పరిటాల సునీత చీప్ పాలి'ట్రిక్స్'

సాక్షి, పుట్టపర్తి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రత్యక్షంగా ఎదుర్కొనే సత్తా లేక మాజీ మంత్రి పరిటాల సునీత చీప్ ట్రిక్స్ చేస్తున్నారు. కనీసం వెంట తిరిగే వారు కూడా జీర్ణించుకోలేని స్థితిలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. పార్టీ కార్యకర్తలకే టీడీపీ కండువాలు వేసి కొత్తగా చేరినట్లు ప్రచారం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో టీడీపీ పూర్తిగా పట్టు కోల్పోయింది. అయితే కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు చేయాలనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల వేదికగా.. సొంత పార్టీ కార్యకర్తలకే కండువా వేసి కొత్తగా పార్టీలో చేరారని చెబుతున్నారు. వాస్తవాలు తెలుసుకున్న 'తమ్ముళ్లు' పరిటాల సునీత గిమ్మిక్కులపై మండి పడుతున్నారు. ఆదివారం రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం మద్దెలచెరువు, వేపకుంట గ్రామాల్లో పరిటాల సునీత ప్రచారం చేశారు. కాగా వేపకుంటలో పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు ఆమె సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేశారు. కానీ అందులో ఉన్న వారందరూ టీడీపీ కార్యకర్తలే.

ఉద్యాన సిరులు

పండ్ల తోట రైతులకు ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్న రైతులు పండ్ల తోటలు అధికంగా సాగు చేశారు. మార్కెట్‌లో దొరికే హైబ్రీడ్ విత్తనాలు కొనుగోలు చేసి సస్యరక్షణతో పాటు సమయానికి మందులు పిచికారి చేయడం, సరైన మోతాదులో ఎరువులు అందించడంతో మంచి దిగుబడితో పాటు గిట్టుబాటు ధరలు లభించాయి.

- కర్బూజ, పుచ్చకాయలకు భారీ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా 1,785 ఎకరాల్లో పంటల సాగు
- రికార్డు స్థాయి ధరలతో రైతుల్లో వెల్లివిరిసిన సంతోషం



పెడపల్లి వద్ద కర్బూజ తోట



ఎనుములపల్లి నుంచి బెంగళూరు మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన దోస కాయలు

పుట్టపర్తి అర్బన్: పండ్ల తోటలు సిరులు కురిపిస్తుండటంతో రైతులు మురిసిపోతున్నారు. గతంలో ఉన్న తోటలకు అదనంగా ఈ ఏడాది జలకళ పథకం కింద బోర్లు వేసుకున్న రైతులకు మోటార్లు అందించారు. దీంతో రైతులు పండ్ల తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. జిల్లాలో వివిధ రకాల పుచ్చకాయలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. ఇక కర్బూజ రకాలైన నిర్మల్, లార్విన్, గోల్డెన్ గౌరీ, గోల్డెన్ గ్లామర్ తదితరాలు సాగు చేశారు.

ఎకరాకు 10 టన్నుల దిగుబడి

సకాలంలో సాగు చేసిన కర్బూజ, పుచ్చకాయలు ఎకరాకు 10 టన్నుల మేర దిగుబడులు వచ్చాయి. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.4లక్షల ఆదాయం వచ్చిందని రైతులు తెలుపుతున్నారు. కర్బూజ ప్రస్తుతం బెంగళూరు మార్కెట్‌లో టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతోంది. ఇక పుచ్చకాయలు టన్ను రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఇంతటి ధరలు ఎన్నడూ చూడలేదని రైతులు సంతోషం వ్యకం చేస్తున్నారు.

జిల్లాలో 1,785 ఎకరాల సాగు

జిల్లా వ్యాప్తంగా 1,785 ఎకరాల్లో రైతులు కర్బూజ, పుచ్చకాయల తోటలు సాగు చేశారు. ఈ ఏడాది కర్బూజ అత్యధికంగా ఎన్పీ కుంటలో 362 ఎకరాలు, ముదిగుబ్బ మండలంలో 180, తనకల్లు మండలంలో 130 ఎకరాలు, కొత్తచెరువు మండలంలో 125 ఎకరాలు, రొద్దం మండలంలో 96 ఎకరాలు, బుక్కపట్నం, పెనుకొండ మండలాల్లో 100 ఎకరాలు, దాదాపు 22 మండలాల్లో 1,175 ఎకరాల్లో సాగైంది. ఇక పుచ్చకాయ తోటలు అత్యధికంగా తనకల్లు మండలంలో 120 ఎకరాలు, గాండ్లపెంట మండలంలో 86 ఎకరాలు, తలుపుల, ఎన్పీ కుంట మండలాల్లో 80 ఎకరాలు, కొత్తచెరువులో 32 ఎకరాలు, రొళ్లలో 50 ఎకరాలు, బుక్కపట్నం, ముదిగుబ్బ, రొద్దంలో 150 ఎకరాలు, కలిపి 19 మండలాల్లో 610 ఎకరాలు సాగు చేశారు.

పండ్ల తోటలతో లాభాలు



పండ్ల తోటల్లో మంచి దిగుబడులు, లాభాలు వస్తున్నాయి. పుచ్చకాయ, కర్బూజతో పాటు బొప్పాయి, దానిమ్మ, ద్రాక్ష, చీనీకి మంచి ధరలు లభిస్తున్నాయి. రెండించుల నీళ్లున్న బోరు బావి కింద గతంలో రెండు మూడు ఎకరాలు సాగు చేసే రైతు సూక్ష్మ పరికరాలు అమర్చి 10 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు.

– చంద్రాయుడు, రైతు, సుబ్బరాయనిపల్లి

అధికారుల సూచనలు ఫలిస్తున్నాయి



ఉద్యాన అధికారుల సూచనలకు అనుగుణంగా సాగు చేసిన పండ్ల తోటలకు మంచి దిగుబడితో పాటు గిట్టుబాటు ధరలు వచ్చాయి. ఎకరాకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. అధికారుల సూచనల మేరకు సకాలంలో సాగు చేయడం, ఎరువులు వేయడం, వ్యాధులు సోకినపుడు మందులు పిచికారి చేసి పంటలను సంరక్షించుకుంటున్నాం.

– గంగిరెడ్డి, బైరాపురం, కొత్తచెరువు

ధరలు ఆశాజనకం



ఈసారి వేసవిలో రంజాన్ మాసం రావడం, ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో కర్బూజా, పుచ్చకాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మంచి హైబ్రీడ్ వెరైటీలు సాగు చేస్తుండడంతో దిగుబడి శాతం పెరిగింది. ప్రస్తుతం రైతుల్లో కొంత విద్యావంతులు వస్తుండడంతో సకాలంలో పంటలు సాగు చేసి ఆదాయం పొందుతున్నారు. ఈ పంటలు రైతులకు బాగా కలిసి వచ్చాయి.

– చంద్రశేఖర్, ఉద్యానశాఖ జిల్లా అధికారి

27న టీసీఎస్ క్యాంపస్ డ్రైవ్



అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఈ నెల 27న టీసీఎస్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తెలిపారు. వర్సిటీ ట్రాన్సిట్ క్యాంపస్–2, సీఆర్ఐటీ కళాశాల క్యాంపస్‌లో ఉదయం 9 గంటలకు డ్రైవ్ ప్రారంభమవుతుందన్నారు. 2022,2023 సంవత్సరాల్లో గుర్తింపు పొందిన వర్సిటీల నుంచి ఆర్ట్స్, కామర్స్, సైన్స్ స్ట్రీమ్‌ల్లో బ్యాక్‌లాగ్ లేకుండా రెగ్యులర్ డిగ్రీ పూర్తి చేసినవారు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. విద్యార్థులు రాత పరీక్షకు హాజరయ్యే ముందు https://nextstep.tcs.campus/లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

విద్యార్థిని ఆత్మహత్య


పూర్ణవర్ధిని

బత్తలపల్లి: జీవితంపై విరక్తితో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం కోడేకండ్లకు చెందిన ఏకిల చెన్నకేశవనాయుడు, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్నపాటి దుకాణంతో పాటు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని ఓ కళాశాలలో ట్రిబుల్‌–ఈ చదువుతున్న పెద్ద కుమార్తె లిల్లీ అలియాస్‌ పూర్ణవర్ధిని (17) నాలుగు నెలలుగా ఛాతిలో నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె ఆదివారం నొప్పి తీవ్రత తాళలేక పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన తమ్ముడు షణ్ముఖనాయుడు గమనించి గట్టిగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారక్కడకు చేరుకుని ఆమెను కాపాడారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న పూర్ణవర్ధినిని తల్లిదండ్రులు ఆగమేఘాలపై ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు బోల్తా


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

చిలమత్తూరు: ప్రయాణికులతో వెళుతున్న ప్రజారవాణా విభాగం (ఆర్టీసీ) బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. వివరాలు... బెంగళూరు నుంచి తాడిపత్రికి బయలుదేరిన పీటీడీ బస్సు చిలమత్తూరు మండలం కోడూరు థామస్‌ మన్రో తోపు సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఓ ప్రయాణికుడిని ఎక్కించుకుని ముందుకు కదిలింది. దాదాపు 200 మీటర్ల దూరం వెళ్లగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో మొత్తం 25 మంది ప్రయాణికులు ఉన్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ ద్వారా చిలమత్తూరులోని పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందజేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పంటల సాగుకు ఊతం



రైతు భరోసా పథకంతో పంటల సాగుకు ఊతమిచ్చినట్టైంది. నాకున్న మూడు ఎకరాల్లో గతంలో పంటల సాగుకు పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడేవాడిని. ఉన్న బోరు బావి కూడా ఎండిపోవడంతో దిక్కుతోచలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత విస్తారంగా వర్షాలు కురిసాయి. సీజన్‌కు ముందే నా బ్యాంక్‌ ఖాతాలో రైతు భరోసా నగదును సీఎం వైఎస్‌ జగన్‌ జమ చేశారు. ఈ డబ్బుతో పంట పెట్టుబడుల సమస్య తీరింది. రైతు సంక్షేమానికి అండగా నిలిచిన సీఎం వైఎస్‌ జగన్‌ మరోమారు అధికారంలోకి రావాలి.

– రైతు అనిల్‌కుమార్‌, రామినేపల్లి, బొకుగుప్ప మండలం


గౌరవ మర్యాదలు పెరిగాయి



నాకు 70 ఏళ్ల వయస్సు. ఈ వయస్సులో ఉన్న మాకు సీఎం వైఎస్‌ జగన్‌ అందజేస్తున్న సంక్షేమ ఫలాల వల్ల గౌరవ మర్యాదలు పెరిగాయి. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సేవలు నేను చూడలేదు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500, వృద్ధాప్య పింఛన్‌ కింద ప్రతి నెలా రూ.3వేలు చొప్పున అందుకున్నా. ఇలాంటి ముఖ్యమంత్రిని మరోమారు అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తిమ్మన్న, కాలువపల్లి, బొకుగుప్ప మండలం

నవ



శకం

సంక్షేమానికి మారుపేరు



నవరత్నాల పథకాలతో సంక్షేమానికి మారుపేరుగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. ఏ ఇంటికి వెళ్లినా ఏదో ఒక పథకం లబ్ధి పొందినట్లుగా చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేయడం చాలా గొప్ప విషయం. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. దీంతో అందరి దృష్టి ప్రభుత్వ పాఠశాలలపైనే పడింది. సీఎం వైఎస్‌ జగన్‌పై ప్రజలకు ఆపారమైన నమ్మకం ఏర్పడింది. ఇలాంటి సంక్షేమ పాలన కావాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

– నూర్‌బాషా, విశ్రాంత హెడ్‌మాస్టర్‌, రామకోటి, పెద్దవపూరు మండలం

జీవనోపాధులు మెరుగుపడ్డాయి



గతంలో సంక్షేమ పథకాలు అందక చాలా ఇబ్బందులు పడ్డాం. కూలి పనులే దిక్కయ్యాయి. సీఎం వైఎస్‌ జగన్‌ అందించిన సంక్షేమ పథకాలతో మా జీవనోపాధులు మెరుగుపడ్డాయి. మా కుమారుడు ఆంజనేయులుకు వలంటీర్‌గా పనిచేసే అవకాశం కల్పించారు. ఆసరా పథకంతో ఏటా రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు అందించారు. నా భర్త హనుమంతుకు కళాకారుల పింఛన్‌ అందుతోంది. చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుకున్నాం. వైఎస్సార్‌ కల్యాణమస్తు పథకం కింద కోడలు దివ్యకు రూ.లక్ష అందజేశారు. దీంతో ఒక్కసారిగా మా కుటుంబంలో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. మరోసారి వైఎస్‌ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– రామాంజినమ్మ, రామినేపల్లి, బొకుగుప్ప మండలం

ఓటు వివరాలూ తెలుసుకోవచ్చు

- అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్‌
- ఓటు హక్కు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తు
- ఓటుకు ఫోన్‌ నంబర్‌ అనుసంధానం

అనంతపురం అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇలాంటి తరుణంలో ఓటరు జాబితాలో తన పేరు ఉన్నదో? లేదో? అనే ఆత్రుత అందరిలోనూ నెలకొంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్‌... జాబితాలో ఓటు వివరాలు తెలుసుకునే సదవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్‌ ప్రక్రియ ముగిసే ఏప్రిల్‌ 25వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్‌ హెల్ప్‌లైన్‌..

- ఓటరు జాబితాలను పోలింగ్‌ కేంద్రాల పరిధిలోని బూత్‌ లెవల్‌ అధికారి (బీఎల్‌ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల కమిషన్‌ కల్పించింది. ఇందు కోసం ప్రత్యేకంగా ఓటర్‌ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.
- స్మార్ట్‌ఫోన్లలో 'ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌'ను ఇన్‌స్టాల్‌ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. యాప్‌ ఓపెన్‌ చేయగానే ఆప్షన్లు వస్తాయి. 'సెర్చ్‌ యువర్‌ నేమ్‌ ఇన్‌ ఎలక్టోరల్‌ రోల్‌' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్‌ చేస్తే 'సెర్చ్‌ బై' కింద వచ్చిన ఆప్షన్లలో 'సెర్చ్‌ బై ఎపిక్‌ నంబర్‌' ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.
- కంప్యూటర్‌ ద్వారా ఓటర్‌ వివరాలు తెలుసుకునే వారు https:// electoralsearch. eci. gov. in/ వెబ్‌సైట్‌ను ఓపెన్‌ చేయాలి. అందులో సెర్చ్‌ బై ఎపిక్‌ నంబర్‌ అనే ఆప్షన్‌ పై క్లిక్‌ చేసి, ఓటర్‌ ఐడీ నంబర్‌, స్టేట్‌ అనే చోట ఆంధ్రప్రదేశ్‌ అని సెలెక్ట్‌ చేసుకోవాలి. క్యాప్చర్‌ కోడ్‌ ఎంటర్‌ చేసి సెర్చ్‌ ఆప్షన్‌ను క్లికి చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.



ఓటరు హెల్ప్‌లైన్‌ యాప్‌

- ఓటు వివరాలు తెలుసుకునేందుకు 1950 టోల్‌ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్‌ అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్‌ చేసి ఓటర్‌ ఐడీ నంబర్‌ చెబితే... అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

ఓటు లేకపోతే నమోదు చేసుకోవాలి..

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎల్‌ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఫోన్‌ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్‌ ఫోన్‌ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్‌ విడుదల చేసింది. http:// ceoaperms.ap.gov.in/AP&MobileNo Registration/ MobileNo Registration. aspx లింక్‌ను తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్‌ ఎంటర్‌ చేయాలి. దాని కిందనే ఫోన్‌ నంబర్‌ ఎంటర్‌ చేసి రిజిస్టర్‌ ఆప్షన్‌ను క్లిక్‌ చేయాలి. వెంటనే ఫోన్‌ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్‌ చేసిన తర్వాత ఓటర్‌ ఐడీకి ఫోన్‌ నంబర్‌ అనుసంధానమైపోతుంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

హిందూపురం అర్బన్‌: మండలంలోని మలుగూరు సమీపంలో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్ట్‌ చేసినట్లు డీఎస్పీ కంజాక్షన్‌ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అందిన ముందస్తు సమాచారం మేరకు... ఆదివారం మధ్యాహ్నం మలుగూరు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 18 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.68,300 నగదు స్వాధీనం చేసుకుని 13 ద్విచక్ర వాహనాలు సీజ్‌ చేశారు. పట్టుబడిన వారిలో హిందూపురంలోని బోయపేట, విద్యానగర్‌, పరిగి, రొద్దం, కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన వారు ఉన్నారన్నారు.

ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్న చంద్రబాబు

- శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి ధ్వజం


మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్‌: ఎమ్మెల్యే అభ్యర్థుల సీట్లు అమ్ముకుని పార్టీని నమ్ముకున్న వారికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీరని మోసం చేశారని ఆ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి మండిపడ్డారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. నాయకులు కృష్ణమూర్తి, దలవాయి వెంకటనారాయణ, పోలన్న మాట్లాడుతూ.... రాజకీయంగా వడ్డెర్లను ఎదగనివ్వకుండా చంద్రబాబు తొక్కి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్‌ స్థానాలలో పోటీ చేసే అవకాశం ఇస్తానని గతంలో చంద్రబాబు మాట ఇచ్చారని గుర్తు చేశారు. పుట్టపర్తి అసెంబ్లీ స్థానాన్ని రూ. కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఎంపీ స్థానాన్ని కూడా వడ్డెర్లకు కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న వారిని చంద్రబాబు నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వడ్డెర్లకు రాజకీయ అవకాశం కల్పించకపోతే టీడీపీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంచెపు వెంకటేష్‌, మారెప్ప, చక్రపాణి, మల్లికార్జున, గంగులప్ప, ఉత్తన్న, నాగరాజు, హోన్నూరు, నారాయణస్వామి, శ్రీరాములు, పెద్దన్న, కిష్ట తదితరులు పాల్గొన్నారు.


సైన్స్‌కు సవాల్‌గా మూలవిరాట్‌



కదిరి: నవ నారసింహ క్షేత్రాల్లో కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఇక్కడ నిత్య పూజలతో స్వామివారు వెలుగొందుతున్నారు. లోక కంటకుడైన హిరణ్య కశ్యపుని తన చేతి గోళ్లతో సంహరిస్తున్నట్లుగా ఇక్కడి మూలవిరాట్‌ ఉంటుంది. తన భక్తుడు భక్త ప్రహ్లాదుడితో సమేతంగా ఉన్న నరసింహస్వామి దర్శనం ఇక్కడ తప్పా దేశంలో మరెక్కడా లేదు. స్వామి మూలవిరాట్‌కు ఎడమ భాగాన ప్రహ్లాదుడు నిల్చొని ఉండడం గమనించవచ్చు. భక్త ప్రహ్లాద సమేత నారసింహుడి దర్శనం.. పాప విమోచనం అని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు చెబుతున్నారు. ఇంతటి విశిష్టత కలిగిన ఆలయం దేశంలోనే ఎక్కడా లేదని పురాణాలూ చెబుతున్నాయి. పక్షం(15) రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగేది కూడా కదిరిలో మాత్రమే. ఇక్కడి మూలవిరాట్‌లో దైవ రహస్యం దాగుందని భక్తుల నమ్మకం. మూలవిరాట్‌కు అర్చకులు ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మాత్రమే అభిషేకం చేస్తారు. అది స్వామి వారి జన్మ నక్షత్రం. ఆ రోజు అభిషేకం చేసిన తర్వాత మూలవిరాట్‌ నాభి నుంచి స్వేదం వస్తుంటుంది. ఆ స్వేదం ఎక్కడి నుంచి వస్తుందో కూడా తెలియని పరిస్థితి. వస్త్రంతో ఆ స్వేదాన్ని తుడిచినప్పటికీ మళ్లీ రావడం గమనార్హం. ఈ దృశ్యాన్ని ఆలయ అర్చకులు అభిషేకానికి హాజరైన భక్తులకు చూపిస్తుంటారు. స్వామివారు ఇక్కడ నిజరూపంలో ఉన్నారని చెప్పడానికి ఇదే ప్రబల నిదర్శనమని భక్తుల నమ్మకం. ఇక్కడి గర్భ గుడిలోని మూలవిరాట్‌కు ఫొటోలు తీయడం నిషేధం.


భక్త ప్రహ్లాద సమేత నారసింహుడి మూలవిరాట్‌

వైభవంగా కాటమయ్య ప్రభ ఊరేగింపు


కాటికోటేశ్వరక్షేత్రానికి తరలిస్తున్న కాటమయ్య స్వామి ప్రభ

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన కాటి కోటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కాటమయ్య స్వామి ప్రభను వైభవంగా ఊరేగించారు. స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరు నుంచి కాటమయ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి, పెళ్లి కొడుకు తరహాలో గ్రామంలోకి తీసుకువచ్చారు. అనంతరం అశ్వ, గజ, వృషభ వాహనోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. గొరవయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ముష్టూరులో సాయంత్రం నరసింహారెడ్డి, ఓబిరెడ్డి, పాటిల్‌ ఓబిరెడ్డి, ఆనందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, చిట్టిబాల మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కరణం సూర్యప్రకాష్‌రావుతోపాటు పలువురు గ్రామ పెద్దలు... ఆలయ ధర్మకర్త సుధాకరరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని సమావేశమయ్యారు. వారి ఆధ్వర్యంలో స్వామి ప్రభ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ చెడిపోతుల గోపాల్‌, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం ఉంటుంది. రాత్రి లంకా దహనం నిర్వహించనున్నారు.

మండల వాసి కర్ణాటకలో హత్య

చిలమత్తూరు: మండల సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. హతుడిని చిలమత్తూరు మండలం దేమకేతేపల్లికి చెందిన దాసరి వెంకటేశప్ప (56)గా కర్ణాటక పోలీసులు గుర్తించారు. వ్యక్తిగత పనిపై బాగేపల్లికి వెళ్లిన ఆయనను ఆదివారం తెల్లవారుజామున అక్కడి టీబీ క్రాస్‌లో గొంతు కోసి హతమార్చారు. విషయం తెలుసుకున్న బాగేపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. హత్యకు కారణాలు, ఎవరు చేశారనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, బేల్దారి పనులతో జీవనం సాగిస్తూ వచ్చిన వెంకటేశప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్‌: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని అధిష్టింపజేసి ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ముందుకు లాగారు. విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్‌ కూడలి, పెట్రోల్‌బంక్‌, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్‌ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. కార్యక్రమంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న వృద్ధులు


స్విమ్మింగ్‌పూల్‌లో చిందేస్తున్న చిన్నారులు


పాఠశాల వద్ద చల్లని పానీయం సేవిస్తున్న విద్యార్థులు


మండుటెండలో కర్బూజాలు విక్రయిస్తున్న దృశ్యం

భానుడి భగభగ...

జనం విలవిల

పుట్టపర్తి రూరల్‌: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ప్రజలు, పశు పక్షాదులు తాపాన్ని తట్టుకోలేక పోతున్నాయి. వేసవి తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం కూలర్లు, చెట్ల నీడన జనం చేరుకుంటున్నారు. ఇక మంచినీటితో పాటు కొబ్బరి బోండాలు, తాటి ముంజలు, కర్బూజాలు, దోసకాయలు, చెరకు, పండ్ల రసాలు, మజ్జిగ, లస్సీలకు డిమాండ్‌ భారీగా నెలకొంది. చెరువులు, బావులు, కుంటలు, స్విమ్మింగ్‌ పూల్‌లో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్న వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. గ్రామాల్లో ఇంట్లో ఉక్కపోత భరించలేక రచ్చకట్టలపై చెట్ల నీడన సేద దీరుతున్నారు.